క్లుప్తంగా

ఓలుబెడ్డాలో విద్యుత్ స్తంభాల ఏర్పాటు

సాక్షి ఎఫెక్ట్..


ఓలుబెడ్డాలో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేస్తున్న కార్మికులు

హుకుంపేట: మండలంలోని మారుమూల తీగలవలస పంచాయతీ ఓలుబెడ్డా గ్రామంలో మంగళవారం కొత్త విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేశారు. 'పొంచి ఉన్న ప్రమాదం' అనే శీర్షికతో ఇటీవల 'సాక్షి'లో ప్రచురించిన వార్తకు విద్యుత్ శాఖ అధికారులు స్పందించారు. ఈ నేపథ్యంలో ఓలుబెడ్డా, పనసబంద,కిన్నెర్లోవ తదితర గ్రామాల్లో తుప్పుపట్టిన పాత ఇనుప స్తంభాలను తొలగించి కొత్తవాటిని ఏర్పాటు చేస్తున్నట్టు మండల విద్యుత్ శాఖ అధికారి రమణ తెలిపారు.

నేడు నేషనల్ యంగ్ లీడర్స్ కార్యక్రమం

అరకులోయ రూరల్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో బుధవారం నేషనల్ యంగ్ లీడర్స్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు నెహ్రూ యువ కేంద్రం ఉమ్మడి విశాఖ జిల్లా అధికారి జి.మహేశ్వరరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు.ఈ కార్యక్రమానికి విద్యార్థులందరూ హాజరు కావాలని ఆయన కోరారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి

చింతూరు: చింతూరు, ఎర్రంపేటల్లో గిరిజనేతరులకు చెందిన అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా శ్రీను కోరారు. మంగళవారం ఆయన చింతూరులో మాట్లాడుతూ గిరిజనేతరుల అక్రమ నిర్మాణాలపై హైకోర్టు, ఎల్‌టీఆర్ కోర్టుల్లో కేసు కొనసాగుతున్నా నిర్మాణాలు ఎలా జరుగుతున్నాయో అర్థం కావడం లేదన్నారు. ఈ విషయంపై కలెక్టర్, ఐటీడీఏ, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినట్టు ఆయన తెలిపారు.

మృతురాలి కుటుంబానికి వైఎస్సార్ బీమా


నగదు అందజేస్తున్న సర్పంచ్ ఉపేంద్ర

అరకులోయ రూరల్: మండలంలో చిన్నలబుడు పంచాయతీ మంజగూడ గ్రామానికి చెందిన గరం తులసి ఇటీవల కేన్సర్‌తో మృతి చెందింది.దీంతో రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ బీమా కింద రూ.లక్ష బాధిత కుటుంబానికి మంజూరు చేసింది. మంగళవారం తక్షణ సాయం కింద స్థానిక సర్పంచ్ ఉపేంద్ర మృతురాలి భర్త లవకుశకు రూ.10వేలు నగదు అందజేశారు. ఈకార్యక్రమంలో సచివాలయం వెల్ఫేర్ అసిస్టెంట్ మల్లేశ్వరి,జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు లక్ష్మణ్‌కుమార్,వైఎస్సార్ సీపీ నాయకుడు పూర్ణచందర్ ఎంపీటీసీ సభ్యుడు సత్రుగున్ పాల్గొన్నారు.

పది విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ


విద్యార్థులకు మెటీరియల్ అందిస్తున్న శివాజీరాజు, తదితరులు

కె.కోటపాడు: చౌడువాడ గ్రామానికి చెందిన దివంగత సుందరపు సత్యనారాయణ కుమారులు విద్యాభివృద్ధికి ఏటా అందిస్తున్న సహకారం అభినందనీయమని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దాట్ల శివాజీరాజు అన్నారు. విశాఖ డెయిరీ డైరెక్టర్ సుందరపు సత్యనారాయణ జ్ఞాపకార్థం ఆయన కుమారులు విశాఖ డెయిరీ డైరెక్టర్ గంగాధర్, మహేష్, శివ మంగళవారం స్థానిక హైస్కూల్‌లో పదో తరగతికి చెందిన 120 మంది విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రొంగలి సూర్యనారాయణ, సర్పంచ్ దాడి ఎరుకునాయుడు, ఎంపీటీసీ ఏటుకూరి రాజేష్, గోవాడ సుగర్ ఫ్యాక్టరీ మాజీ డైరెక్టర్ రాజి శ్రీనివాసరావు, కొమార ఈశ్వరరావు, పాల సంఘం అధ్యక్షుడు కొమార వెంకటరమణ, కొమార ఎర్రునాయుడు తదితరులు పాల్గొన్నారు.

నులి పురుగుల నివారణే లక్ష్యం

- డీటీసీవో అధికారి విశ్వేశ్వరనాయుడు


జీకే వీధి : మాత్రలు పంపిణీ చేస్తున్న ఎంపీడీవో ఉమామహేశ్వరరావు, వైద్యాధికారి మహేష్


దుంబ్రిగుడ కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది


హుకుంపేట : కొట్నాపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో మాత్రలు వేయిస్తున్న సీడీపీవో బాలచంద్రమణి దేవి

దుంబ్రిగుడ: నులిపురుగుల నివారణే లక్ష్యంగా వైద్య ఆరోగ్య శాఖ కృషి చేస్తోందని జిల్లా క్షయ నివారణాధికారి విశ్వేశ్వరనాయుడు తెలిపారు. మంగళవారం దుంబ్రిగుడ మండలంలోని పర్యటించిన ఆయన కస్తూర్బా బాలికల పాఠశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలను సందర్శించి డీవార్మింగ్ డే సందర్భంగా నులిపురుగుల నివారణపై అవగాహన కల్పించి, మాత్రలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నులిపురుగుల వల్ల రక్త హీనత ఏర్పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి రాంబాబు,హెల్త్ సూపర్ వైజర్ సాంబశివరావు,బాబూరావు, హెల్త్ అసిస్టెంట్ స్వామి, పాఠశాల ప్రత్యేక అధికారి సుజాత తదితరులు పాల్గొన్నారు.

హుకుంపేట: డీ వార్మింగ్ డే సందర్భంగా మండలంలోని ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థులు, చిన్నారులకు ఉప్ప,హుకుంపేట పీహెచ్‌సీల వైద్యాధికారులు ప్రశాంత్, గాయత్రీ,సీడీపీవో బాలచంద్రమణి దేవిల ఆధ్వర్యంలో నులిపురుగుల నివారణ మాత్రలు మింగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని 99 ప్రభుత్వ పాఠశాలలు, 109 అంగన్‌వాడీ కేంద్రాల్లో 8,890మందితో డీవార్మింగ్ మాత్రలు మింగించినట్టు చెప్పారు.

ముంచంగిపుట్టు: స్థానిక ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలర పాఠశాల–1లో కిలగాడ వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో విద్యార్థులకు హెచ్ఎం మాణిక్యాలరావు నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేశారు. కిలగాడ పీహెచ్‌సీ పరిధిలోని 9 గ్రామ సచివాలయాల్లో పాఠశాలల్లో విద్యార్థులకు నులిపురుగు నివారణ మాత్రలను వైద్యా సిబ్బంది వేశారు. ఈ సందర్భంగా కిలగాడ వైద్యాధికార్లు ఎస్.రమేష్,శిరీషలు మాట్లాడుతూ చిన్న పిల్లల్లో నులిపురుగులు తొలగించేందుకు ఈ మాత్రలు పంపిణీ చేస్తున్నట్టు చెప్పారు.

జి.మాడుగుల: మండలంలోని పలు పాఠశాలల విద్యార్థులతో నులిపురుగుల నివారణ మాత్రలను పీహెచ్‌సీ వైద్యాధికారులు శశికాంత్, రవి చంద్రశేఖర్ మింగించారు. మొత్తం 9,564 మందికి ఈ మాత్రలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి నడికట్ల ప్రకాష్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చింతపల్లి: చిన్నారుల్లో నులిపురుగుల నివారణకు చర్యలు తీసుకోవాలని లంబసింగి పీహెచ్‌సీ వైద్యాధికారి నీరజా తెలిపారు. పీహెచ్‌సీ పరిధిలోని పలు గ్రామాల్లో విద్యార్థులు,చిన్నారులతో మంగళవారం నులిపురుగుల నివారణ మాత్రలు మింగించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యక్తిగత శుభ్రత పాటించాలన్నారు.ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది బాలయ్య,నాగరత్నం తదితరులు పాల్గొన్నారు.

గూడెంకొత్తవీధి: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలను వైద్యారోగ్యశాఖ సిబ్బంది పంపిణీ చేశారు. ఆర్వీనగర్ పాఠశాల వద్ద విద్యార్థులకు ఎంపీడీవో ఉమామహేశ్వరరావు,ఈవోపీఆర్డీ పాపారావు, వైద్యాధికారి మహేష్ మాత్రలు పంపిణీ చేశారు.

కొయ్యూరు:ప్రతి విద్యార్థీ నులిపురుగుల నివారణ మాత్రలు వేసుకోవాలని ఎంపీడీవో మేరీరోజ్,డౌనూరు వైద్యులు లలిత సూచించారు. డౌనూరు బాలుర ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు మంగళవారం నులిపురుగు మాత్రలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అందరూ పరిశుభ్రతను పాటించాలని తెలిపారు. హెచ్ఎం ప్రభుదాస్,వార్డెన్ హరిదేవ్,వైద్య సిబ్బంది పాల్గొన్నారు

అడ్డతీగల: నులిపురుగుల నివారణ కోసం మండలంలోని దుప్పులపాలెం పీహెచ్‌సీ పరిధిలో 95.6 శాతం మంది చిన్నారులతో మాత్రలు మింగించినట్టు వైద్యాధికారిణి షామా తెలిపారు. 42 అంగన్‌వాడీ కేంద్రాల్లో 1,315 మంది చిన్నారులు ఉండగా 1,270 మందితో మాత్రలు మింగించామన్నారు. 46 పాఠశాలల్లో 2,060 మంది విద్యార్థులకుగాను 1,969 మందికి మాత్రలు అందజేసినట్టు చెప్పారు. ఈనెల 18 న మరోమారు ఈ కార్యక్రమాన్ని నిర్వహించి వందశాతం మందికి మాత్రలు పంపిణీ చేస్తామని తెలిపారు.

ఎల్లవరం పీహెచ్‌సీ పరిధిలోని 48 అంగన్‌వాడీ సెంటర్లలో 1,340 మంది చిన్నారులతో మాత్రలు మింగించినట్టు వైద్యాధికారి కె.భాస్కర్ తెలిపారు. 46 పాఠశాలల్లో 3,691 మంది విద్యార్థులతో మాత్రలు వేయించాన్నారు.

రాజవొమ్మంగి: జడ్డంగి పీహెచ్‌సీ పరిధిలో 32 పాఠశాలలు, 41 అంగన్‌వాడీ కేంద్రాల్లోని 2437 మంది విద్యార్థులతో నులిపురుగుల నివారణ మాత్రలు మింగించినట్టు డాక్టర్ సుజి, డాక్టర్ యామిని తెలిపారు. మిగతా పిల్లలకు శనివారం లోగా అందజేస్తామన్నారు.

ఎటపాక: డీవార్మింగ్ డే సందర్భంగా మంగళవారం పురుషోత్తపట్నం సెయింట్ ఆన్స్ పాఠశాలలో చిన్నారులకు గుండాల ఎంపీటీసీ గొంగడి వెంకటరామి రెడ్డి మాత్రలు వేశారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గంగవరం : మండలంలోని అన్ని పాఠశాల్లో డీవార్మింగ్ డేను విజయవంతంగా నిర్వహించారు. బర్రిమామిడి దిబ్బలవీధి జీపీఎస్ పాఠశాలలో జెడ్పీటీసీ సభ్యురాలు బేబిరత్నం విద్యార్థులతో మాత్రలు మింగించారు. స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల్లో పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ భావన, డాక్టర్ కె.వి.ఎస్ ఆరోగ్య అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. దిబ్బలవీధి జీపీఎస్ స్కూల్ హెచ్ఎం స్వామిదొర, ఆశ్రమ పాఠశాలల హెచ్ఎంలు ఝాన్సీహేన్సన్, ఆర్.వి.వి. సత్యనారాయణ, పీడీ నాగమణి, పీఈటీ పద్మావతి పాల్గొన్నారు.

రాజవొమ్మంగి: స్థానిక పీహెచ్‌సీ పరిధిలోని 41 పాఠశాలలు, 41 అంగన్‌వాడీ కేంద్రాల్లో 4741 మంది చిన్నారులతో నులిపురుగుల నివారణ మాత్రలు మింగించినట్టు డాక్టర్ శ్రీదుర్గ, డాక్టర్ లిఖిత తెలిపారు.


గంగవరం: దిబ్బలవీధి జీపీఎస్ స్కూల్‌లో డీవార్మింగ్ మాత్రలు మింగిస్తున్న జెడ్పీటీసీ బేబిరత్నం


కొయ్యూరు: విద్యార్థితో మాత్రను మింగిస్తున్న ఎంపీడీవో మేరీరోజ్

అగ్నిబాధిత కుటుంబానికి సాయం


నగదు, దుస్తులు అందజేస్తున్న ఎంపీపీ పాయం రంగమ్మ

కూనవరం: వెంకటాయపాలెం పంచాయతీ నర్సింగపేట గ్రామంలో ఆదివారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన సోడె కన్నయ్య కుటుంబానికి ఎంపీపీ పాయం రంగమ్మ, వైఎస్సార్ సీపీ నాయకులు మంగళవారం సాయం అందజేశారు. రూ. 2000 నగదు, సుమారు రూ.ఎనిమిది వేల విలువైన సామగ్రి, 80 కిలోల బియ్యం, కందిపంపు, నూనెలు, కూరగాయలు, దుస్తులు అందజేశారు. ఈకార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆలూరి కోటేశ్వరరావు, చినార్కూరు సర్పంచ్ సున్నం అభిరామ్, మండల యూత్ కన్వీనర్ సోందె పాపారావు, అరవా దివాకర్, మడకం పూర్ణ పాల్గొన్నారు.

అండగా ఉంటాం..

కొయ్యూరు: కొత్తపల్లిలో జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితులకు అండగా ఉంటామని జెడ్పీటీసీ వారా నూకరాజు, చింతపల్లి ఏఎంసీ చైర్మన్ జె.రాజులమ్మ హామీ ఇచ్చారు.వారు మంగళవారం బాధితులను పరామర్శించారు. ప్రభుత్వం నుంచి అన్ని రకాలుగా సాయం అందుతుందని తెలిపారు.

వంటపాత్రలు,నిత్యావసర సరకుల అందజేత

బాధితులు రీమెల యర్రయమ్మ, రాటా మల్లేసు,రీముల శ్రీను కుటుంబాలకు బీజేపీ నేతలు మంగళవారం 50 కిలోల బియ్యం, వారం రోజులకు సరిపడే నిత్యావసర సరకులతో పాటు వంటపాత్రలు, దుప్పట్లను అందజేశారు. బీజేపీ మండల అధ్యక్షుడు ఎం.అప్పలరాజు, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కాకరాపల్లి సుబ్రహ్మణ్యం,నేతలు రీముల చంద్రరావు,అరిమెల రాజు,మంగతల్లి,అన్నపూర్ణ, లోకుల కిరణ్ పాల్గొన్నారు.

కిడ్నీవ్యాధిపై అప్రమత్తం


విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న వైద్యులు

చింతూరు: కిడ్నీవ్యాధి పట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ పుల్లయ్య అన్నారు. ప్రపంచ కిడ్నీ దినోత్సవం సందర్భంగా స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాధి నివారణకు అందరూ తరచూ రక్తపోటు, మధుమేహం పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కిడ్నీ వ్యాధిగ్రస్థుల కోసం స్థానిక ఏరియా ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన ప్రత్యేక విభాగంలో అపోలో డయాలసిస్ ఆధ్వర్యంలో రోజుకు 15 మందికి సేవలు అందిస్తున్నామని తెలిపారు. స్థానిక డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కోటిరెడ్డి, డాక్టర్ సాయికిషోర్, డయాలసిస్ మేనేజర్ ఉమామహేష్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రత్నమాణిక్యం పాల్గొన్నారు.

టాలెంట్ టెస్ట్‌లో విద్యార్థి ప్రతిభ

మాకవరపాలెం: స్థానిక ఉన్నత పాఠశాల విద్యార్థి మెరిట్ టాలెంట్ టెస్టులో జిల్లాలో ద్వితీయ స్థానం సాధించాడు. ఎడ్యుకేషనల్ ఎపిఫనీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో జనవరి 31న రాష్ట్ర స్థాయిలో ఆన్‌లైన్ మెరిట్ టెస్టు నిర్వహించారు. పదో తరగతి విద్యార్థి బోళెం మోక్షిత్ ఈ టెస్టులో ప్రతిభ చూపాడని హెచ్ఎం అచ్యుతరామయ్య మంగళవారం అభినందించారు. విజయవాడలో పాఠశాల విద్యా శాఖ కమిషనర్ సురేష్‌కుమార్ నుంచి సదరు విద్యార్థి రూ.6 వేలతోపాటు సర్టిఫికెట్, జ్ఞాపిక అందుకున్నాడు.


ఉపాధ్యాయులతో మోక్షిత్

హోరాహోరీగా ఎడ్ల, గుర్రపు పరుగు పోటీలు

- ఘనంగా మాడుగుల మోదకొండమ్మ తీర్థం


మాడుగుల రూరల్: వీరనారాయణంలో దౌడు తీస్తున్న ఎడ్లు


మాడుగులలో ఎడ్ల పోటీలను ప్రారంభిస్తున్న ఈర్లె అనురాధ, కమిటీ చైర్మన్ అప్పలరాజు

మాడుగుల: మోదకొండమ్మ తీర్థం సందర్భంగా మంగళవారం మాడుగులలో నిర్వహించిన జిల్లా స్థాయి ఎడ్ల బళ్ల పరుగు పోటీలు హోరాహోరీగా జరిగాయి. ఈ పోటీల్లో 15 ఎడ్లబళ్లు పాల్గొనగా, విజేతగా మాడుగుల బోయపాడు నిలిచింది. చీడికాడ మండలం అర్జునగిరికి చెందిన ఎడ్లబండికి ద్వితీయ స్థానం దక్కింది. జిల్లా స్థాయి గుర్రపు పరుగు పందెంలో పది గుర్రాలు పాల్గొన్నాయి. ఇందులో రాయపురాజుపురానికి చెందిన గుర్రం విజేతగా నిలిచింది. మునగపాక గ్రామానికి చెందిన గుర్రం ద్వితీయ స్థానం దక్కించుకుంది. తొలుత ఈ పోటీలను కె. కోటపాడు జెడ్పీటీసీ ఈర్లె అనురాధ జెండా ఊపి పోటీలు ప్రారంభించారు. ఈ పోటీలు తిలకించడానికి పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చారు. అమ్మవారి తీర్థం సందర్భంగా ఉదయం నుంచి భక్తులు ఆలయానికి చేరుకుని పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఎంపీపీ వేమవరపు రామధర్మజ (పెదబాబు), సర్పంచ్ యడ్ల కళావతి, ఉప సర్పంచ్ శ్రీనాథు శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు బొమ్మిశెట్టి శ్రీనివాసరావు, ఎంపీటీసీ పోలిమేర విజయలక్ష్మి, కుక్కర మహేశ్వరి, కోఆప్షన్ సభ్యురాలు షేక్ ఉన్నీషా తదితర్లు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు పుప్పాల అప్పలరాజు, సభ్యులు దంగేటి సూర్యారావు తదితర సారధ్యంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నారు. రాత్రి పలు చోట్ల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

అమ్మవారికి రూ. 50 వేల విరాళం

భక్తులు పుట్టా ప్రసన్నరాజ్, జయరత్నావల్లీ దంపతులు రూ.50 వేలు విరాళంగా ఆలయ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజుకు అందజేశారు. దాతలను ఆలయ కమిటీ ఘనంగా సత్కరించి అమ్మవారి చిత్రపటాన్ని బహూకరించారు.

వీరనారాయణంలో..

మాడుగుల రూరల్: వీరనారాయణంలో భక్తాంజనేయ స్వామి తీర్థం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఇందులో భాగంగా సాయంత్రం జిల్లా స్థాయి ఎడ్ల, గుర్రపు పరుగు పోటీలు ఉత్సాహంగా నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. సర్పంచ్ యల్లపు కొండప్పారావు, ఎంపీటీసీ దాడి నూకరత్నం, నాయకులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు


రాజవొమ్మంగి గురుకుల జూనియర్ కళాశాలలో పరీక్ష కేంద్రాన్ని పరిశీలించేందుకు వచ్చిన తహసీల్దార్


ముంచంగిపుట్టు: ఏర్పాట్లు పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్ శ్రావణికుమార్


చింతపల్లి కళాశాలలో బెంచ్‌లపై నంబర్లు వేస్తున్న సిబ్బంది

చింతూరు: ఇంటర్మీడియెట్ పరీక్షలకు అధికారులు పకడ్బందీగా ఏర్పాట్లు చేశారు. అన్ని గదుల్లో సీసీ కెమెరాలు అమర్చారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల కేంద్రంలో విద్యార్థులు ఈ ఏడాది పరీక్షలు రాయనున్నారు. మొదటి సంవత్సరంలో 228, ద్వితీయ సంవత్సరంలో 234 మంది, 55 మంది ప్రైవేటు విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు. పరీక్షల నిర్వహణకు తొమ్మిది గదులు ఏర్పాటు చేశామని, చీఫ్ సూపరింటెండెంట్ రఘురాం తెలిపారు.

రాజవొమ్మంగి: స్థానిక గిరిజనసంక్షేమ బాలికల గురుకుల జూనియర్ కళాశాల కేంద్రంగా ఏర్పాటైన పరీక్షకేంద్రాన్ని స్థానిక తహసీల్దార్ వై.వి.సుబ్రహ్మణ్యాచారి మంగళవారం తనిఖీ చేశారు. ఇంటర్ పరీక్షల కోసం చేసిన ఏర్పాట్లను మరో సారి ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. చీఫ్ సూపరింటెండెంట్ విజయ మోహనరావుకు అవసరమైన సూచనలు చేశారు. ఈ పరీక్షకేంద్రంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల, జిల్లాపరిషత్ టెన్ ప్లస్ కళాశాల, స్థానిక గిరిజన బాలికల గురుకుల జూనియర్ కళాశాలలకు చెందిన మొత్తం 547 మంది పరీక్షలు రాయనున్నారు.

ముంచంగిపుట్టు: ఇంటర్మీడియెట్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేసినట్టు స్థానిక కళాశాల ప్రిన్సిపాల్ శ్రావణ్‌కుమార్ తెలిపారు. విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశామని,ఇంటర్ మొదటి సంవత్సరం నుంచి 196 మంది విద్యార్థులు పరీక్షలకు హాజారు అవుతున్నారని, ఏడు గదులలో పరీక్షలు జరుగుతాయన్నారు.

అనంతగిరి: స్థానిక జూనియర్ కళాశాలలో ప్రథమ సంవత్సరంలో 152 మంది, ద్వితీయ సంవత్సరంలో 142 మంది విద్యార్థులు ఇంటర్మీడియెట్ పరీక్షలు రాయనున్నారు. ఏడుగదుల్లో పరీక్షలు నిర్వహించనున్నామని, అన్ని రూమ్‌లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని ప్రిన్సిపాల్ సునంద తెలిపారు.

చింతపల్లి: ఇంటర్మీడియెట్ పరీక్షల నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేసినట్టు అధికారులు తెలిపారు. స్థానిక జూనియర్,ఏపీఆర్ కళాశాలకు చెందిన మొత్తం 1193 మంది విద్యార్థులు హాజరు కానున్నట్లు పిన్సిపాళ్లు రామేశ్వరం,శివకుమార్ తెలిపారు. రెండు కళాశాలల్లో 22 గదుల్లో పరీక్షలు నిర్వహించనున్నారు. అన్ని గదుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు.

'సకాలంలో వైద్యం అందకే పాప మృతి'

రాజవొమ్మంగి: సకాలంలో వైద్యం అందకే మా పాప మరణించిందని దూసరపాము గ్రామానికి చెందిన దీనాకుమారి మంగళవారం స్థానిక విలేకరుల వద్ద వాపోయింది. సోమవారం కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ మూడు నెలల శిశువు సోమవారం మరణించిన సంగతి తెలిసిందే. దీనాకుమారి మాట్లాడుతూ పాపను మొదట రాజవొమ్మంగి పీహెచ్‌సీకు తీసుకు వెళ్లామని, పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ శ్రీదుర్గ పరీక్షించి వెంటనే కాకినాడ జీజీహెచ్‌కు రిఫర్ చేశారని తెలిపింది. అనారోగ్యంతో ఉన్న పాపను వంద కిలోమీటర్ల దూరంలోని కాకినాడకు అంబులెన్స్ తరలించామని, మార్గమధ్యంలో రెండు సార్లు ఫిట్స్ వచ్చిందని కుమారి తెలిపింది.

రాజవొమ్మంగి పీహెచ్‌సీలో ప్లిలల చికిత్సకు అవసరమైన సరంజామా ఉండి, సకాలంలో చికిత్స చేసి ఉంటే మా పాప బతికేదని తెలిపింది. రాజవొమ్మంగి పీహెచ్‌సీలో పిల్లలకు చికిత్స అందజేసేందుకు అవసరమైన సరంజామా లేదని మండలంలోని దూసరపాము సర్పంచ్ చీడి శివ ఆరోపించారు. ఉన్నతాధికారులు దీనిపై దృష్టి సారించాలని కోరారు.

రైతులకు రూ.21 లక్షల రుణాలు

బుచ్చెయ్యపేట: ప్రభుత్వం రాయితీపై అందిస్తున్న రుణాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని వడ్డాది కోఆపరేటివ్ అధ్యక్షుడు దొండా సన్యాసిరావు తెలిపారు. మంగళవారం వడ్డాది, చిన అప్పనపాలెం తదితర గ్రామాలకు చెందిన పలువురు రైతులకు రూ. 21 లక్షలు రుణాలను ఆయన పంపిణీ చేశారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రైతుల సంక్షేమం కోసం పలు రాయితీ రుణాలను అందిస్తున్నారన్నారు. డైరెక్టర్లు కోవెల ఈశ్వరరావు, పొలిమేర కాశి, సిబ్బంది పాల్గొన్నారు.


రైతులకు రుణాలందిస్తున్న సన్యాసిరావు

యువత లక్ష్యంగా సోషల్ మీడియా మోసాలు

అనకాపల్లిటౌన్ : సోషల్ మీడియా ద్వారా యువతను లక్ష్యంగా చేసుకుని కొన్ని యాప్‌ల నిర్వాహకులు మోసాలకు పాల్పడుతున్నారని, అటువంటి వాటిని ప్రభుత్వం తక్షణమే నియంత్రించాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి వియ్యపు రాజు కోరారు. స్థానిక కోడిగంటి గోవిందరావు భవనంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సోషల్ మీడియాలో రోజురోజుకీ ఆన్‌లైన్ మోసాలు పెరుగుతున్నాయని, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్, ట్విట్టర్‌లు అశ్లీల, అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారుతున్నాయన్నారు. ఈ యాప్‌లు అమాయక యువతను పెడత్రోవ పట్టిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న వియ్యపు రాజు

ఈ సమావేశంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు వి.కన్నబాబు, జిల్లా నాయకులు సాయి, ఆనంద్, తరుణ్ పాల్గొన్నారు.

ప్రకృతి విధానంలో పండ్ల మొక్కల పెంపకం

కశింకోట : ప్రకృతి వ్యవసాయం ద్వారా రైతులు పండ్ల మొక్కల పెంపకాన్ని చేపట్టి అదనపు ఆదాయాన్ని పొందాలని ప్రకృతి వ్యవసాయం మండల ఇన్‌చార్జ్ ద్వారపురెడ్డి రమణ సూచించారు. మండలంలోని జి.భీమవరం గ్రామంలో ప్రకృతి వ్యవసాయం ద్వారా పండ్ల మొక్కల పెంపకం మోడల్‌గా చేపట్టి యాజమాన్య పద్ధతులను మంగళవారం వివరించారు. ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులు తమ భూమిలో గట్లను రెండు మీటర్లు వెడల్పు, రెండు అడుగుల ఎత్తు చేయాలన్నారు. వీటిపై ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్ని అనుసరించి పండ్ల మొక్కలు పెంచుకోవాలన్నారు. నిమ్మ, నారింజ, జామ తదితర మొక్కలను ఉపాధి హామీ పథకం ద్వారా ఉచితంగా అందిస్తారని తెలిపారు. రైతులు కూడా తమ సొంత ఖర్చుతో వేసుకోవచ్చునన్నారు. దీని వల్ల చెట్లు ఫలసాయానికి వస్తే ఆరోగ్యకరమైన పండ్లు ఉత్పత్తి కావడంతోపాటు, అదనపు ఆదాయం సమకూరుతుందన్నారు.

ఆలయానికి ఇన్వెర్టర్ బ్యాటరీ బహూకరణ


ఇన్వెర్టర్ బ్యాటరీ అందజేస్తున్న సర్పంచ్ సంజీవిరావు తదితరులు

మాడుగుల రూరల్: ఎం. కోడూరు గ్రామదేవత మోదకొండమ్మ ఆలయానికి ఇన్వెర్టర్ బ్యాటరీని సర్పంచ్ గొల్లవిల్లి సంజీవిరావు మంగళవారం ప్రధాన అర్చకులుకు అందజేశారు. దీనికి డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, సర్పంచ్ గొల్లవిల్లి సంజీవిరావు దంపతులతోపాటు చిన్న అప్పన్నపాలేనికి చెందిన దొండా నాగేశ్వరరావు దంపతులు ఆర్థిక సాయం అందజేశారు. పీఏసీఎస్ అధ్యక్షుడు గొల్లవిల్లి రాజేశ్, గ్రామ శాఖ అధ్యక్షుడు పడాల అప్పలనాయుడు, నాయకులు పోతిన జగదీశ్, పడాల అప్పలనర్సయ్య, చింతా వెంకటరమణమూర్తి పాల్గొన్నారు.